రైల్వే స్టేషన్‌కు దారేది?

- ఇటీవల భారీ వర్షాలకు కొట్టుకుపోయిన ఆర్మూర్ స్టేషన్ రోడ్డు
- ఇబ్బందుల్లో ప్రయాణికులు
- పట్టించుకోని అధికారులు


ఆర్మూర్ రైల్వే స్టేషన్‌కు వెళ్లే మార్గంలో వరద ప్రవాహానికి కొట్టుకుపోయిన సీసీ రోడ్డు

పెర్కిట్(ఆర్మూర్): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఆర్మూర్ రైల్వే స్టేషన్‌కు వెళ్లే రోడ్డు కొట్టుపోయింది. దీంతో ప్రయాణికులు, ఉద్యోగులు స్టేషన్‌కు వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయినా అధికారులెవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఏడేళ్ల క్రితం స్టేషన్ ఏర్పాటు..

ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని కొటార్మూర్ ప్రాంతంలో ఏడు సంవత్సరాల క్రితం రైల్వే స్టేషన్ ఏర్పాటు చేశారు. ఈ రైల్వే స్టేషన్ ఆర్మూర్ పట్టణం నుంచి మూడు కిలోమీటర్లు, మామిడిపల్లి జాతీయ రహదారుల కూడలి నుంచి ఒకటిన్నర కిలో మీటర్లు, పెర్కిట్ నుంచి మూడు కిలో మీటర్ల దూరంలో ఉంది. ఈ స్టేషన్ నుంచి ప్రయాణికులు ఆయా స్థానాలకు చేరుకోవడానికి ఒకే ఒక మార్గం ఉంది. కానీ ఇటీవల కురిసిన వర్షాలకు వరదల కారణంగా ఆ రోడ్డు కొట్టుకుపోయింది. రైల్వే స్టేషన్ ఏర్పాటు చేసిన ప్రాంతంలో గుట్టలు, చెరువులు సమీపంలో ఉండడంతో రోడ్డు మార్గం సక్రమంగా లేదు. రైల్వే స్టేషన్ వరకు మెరుగైన రవాణ సౌకర్యం లేదు. దీంతో స్టేషన్ ఏర్పాటు చేసినప్పటి నుంచి ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటూనే ఉన్నారు.

వంతెన నిర్మిస్తే మేలు..

ఈ రైల్వే స్టేషన్ నుంచి కాచిగూడ నుంచి పెద్దపల్లి, నిజామాబాద్ నుంచి కరీంనగర్‌కు ప్రతినిత్యం రైలు రాకపోకలు ఉంటాయి. అలాగే కాజీపేట్ నుంచి దాదర్‌కు వారానికి ఒకసారి రైలును కేటాయించారు. ఏడాది క్రితం విద్యుదీకరణ పనులు పూర్తి చేయడంతో కొత్త రైళ్లు వచ్చే అవకాశం ఉంది. ఇలాంటి సమయంలో స్టేషన్‌కు రోడ్డు సదుపాయం సరిగా లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. స్టేషన్‌కు వెళ్లే రోడ్డు లేకపోవడంతో ప్రయాణికులు బస్సులలో ప్రయాణం సాగిస్తున్నారు. దీంతో రవాణ చార్జీలు అధికమవుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైల్వే స్టేషన్ వెళ్లే మార్గంలో వంతెన నిర్మిస్తే, వరద ప్రవాహం నుంచి రోడ్డు సురక్షింతంగా ఉంటుంది. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి వంతెన నిర్మించి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని, రోడ్డు మార్గంలో తగిన సౌకర్యాలు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

పట్టాల మీదుగా వెళ్తున్నాం..



ఇటీవల కురిసిన భారీ వర్షానికి రైల్వే స్టేషన్‌కు వెళ్లే రోడ్డు కొట్టుకుపోయింది. రైల్వే స్టేషన్‌కు వెళ్లడానికి ఇంకో మార్గం లేదు. దీంతో రైల్వే స్టేషన్ వెళ్లడానికి రైలు పట్టాలపై వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. అధికారులు రోడ్డు స్థానంలో వంతెన నిర్మించి శాశ్వత పరిష్కారం చూపాలి.

–గంగాధర్, స్థానికుడు, పెర్కిట్

మరమ్మతులు చేపట్టాలి..



రైల్వే స్టేషన్ వెళ్లే మార్గంలో కొట్టుకుపోయిన సీసీ రోడ్డును వెంటనే పునరుద్ధరించాలి. రోడ్డు కొట్టుకుపోయి పదిహేను రోజులు గడుస్తున్నా, ఇప్పటి వరకు అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. సీసీ రోడ్డు వెంట పొదలను తొలగించి, మరమ్మతులు చేపట్టాలి.

–ప్రసాద్, స్థానికుడు, పెర్కిట్

జీపీ కార్మికుల రాస్తారోకో


బోధన్‌లో రాస్తారోకో నిర్వహిస్తున్న జీపీ కార్మికులు ..


వర్ని మండల కేంద్రంలో..


నందిపేటలో సమ్మె నిర్వహిస్తున్న కార్మికులు

రుద్రూర్/ఎడపల్లి/నవీపేట్/బోధన్/వర్ని/నందిపేట్/మాక్లూర్: తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ, పలు మండలాల్లో సమ్మె చేపట్టిన పంచాయతీ కార్మికులు సోమవారం రాస్తారోకో నిర్వహించారు. పలు మండలాల్లో ప్రధాన రహదారులపై కార్మికులు రాస్తారోకో చేపట్టడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. డ్వాక్రా సంఘాల రుణాలు చెల్లింపులో రెండు నెలల వెసులుబాటు కల్పించాలని కోటగిరి ఐకేపీ కార్యాలయంలో జీపీ కార్మికులు వినతిపత్రం అందజేశారు. మాక్లూర్‌లో కార్మికుల సమ్మెకు ఐఎఫ్‌టీయూ నాయకుడు గంగాధర్ మద్దతు తెలిపారు.

ఎన్డీఎస్ఎల్ కార్మికులను ఆదుకోవాలి



బోధన్: నిజాం దక్కన్ షుగర్స్ లిమిటెడ్(ఎన్డీఎస్ఎల్) కార్మికులను ఆదుకోవాలని కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని షుగర్ ఫ్యాక్టరీ గేట్ ఎదురుగా కార్మికులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం మూడోరోజు కొనసాగాయి. ఈసందర్భంగా కార్మికులు మాట్లాడుతూ.. ప్రభుత్వం తక్షణమే స్పందించాలని కోరారు. కార్మికులకు రావాల్సిన బకాయి వేతనాలు ఇప్పించాలని ఎమ్మెల్సీ కవితను కలిసి కోరామని బోధన్ బీఆర్ఎస్ కార్మిక విభాగం పట్టణ అధ్యక్షుడు రవి శంకర్‌గౌడ్, ఎన్డీఎస్ఎల్ మజ్దూర్ యూనియన్ సభ ప్రధాన కార్యదర్శి ఉపేందర్‌లు తెలిపారు. కార్మికులు భాస్కర్, బాలకృష్ణ, రమేష్, శ్రీనివాస్, భిక్షపతి, లింగంగౌడ్, నాగరాజు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అక్రమ నిర్మాణాన్ని ఆపాలి



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని విద్యాగనర్ కాలనీలో రోడ్డును కబ్జాచేసి చేపడుతున్న అక్రమ నిర్మాణాన్ని ఆపాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు వారు సోమవారం మున్సిపల్ కమీషనర్ ప్రసాద్‌చౌహాన్‌కు వినతి పత్రం అందజేశారు. బీజేపీ ఫ్లోర్‌లీడర్ జీవీ నర్సింహారెడ్డి, పట్టణ అధ్యక్షుడు ద్యాగ ఉదయ్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు యమాద్రి భాస్కర్, రాజేశ్వర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



మాక్లూర్: మండలంలోని చిన్నాపూర్‌కు చెందిన పలువురు యువకులు సోమవారం అడవి మామిడిపల్లిలో డీసీసీ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు దేగపోశెట్టి, గంగాధర్‌గౌడ్, రాజేశ్వర్, రవి ప్రకాష్ పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి



ఆర్మూర్‌టౌన్: వర్షాలకు పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పల్లపు వెంకటేష్ అన్నారు. ఈమేరకు ఆయన, సంఘ నాయకులతో కలిసి సోమవారం డిప్యూటీ తహసీల్దార్ విజయ్‌కాంత్‌కు వినతి పత్రం అందజేశారు. పంట నష్టంపై ప్రభుత్వం స్పందించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. నాయకులు భూమన్న, గణేష్, రాజు, ఎల్లయ్య, అశోక్ పాల్గొన్నారు.

నవీపేట మండల కేంద్రంలో..

నవీపేట: పంట నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని రైతు కూలీ సంఘం నాయకులు సోమవారం నవీపేట తహసీల్దార్ ధన్వాల్‌కు వినతిపత్రం సమర్పించారు. అలాగే మాటు కాలువ మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని కోరారు. నాయకులు దేవేందర్ సింగ్, రాజశేఖర్, సుదర్శన్ పాల్గొన్నారు

పశువులకు వ్యాధి నివారణ టీకాలు



కమ్మర్‌పల్లి: మండలంలోని నాగాపూర్‌లో సోమవారం పశువైద్య శాఖ ఆధ్వర్యంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. పశు వైద్యాధికారి డాక్టర్ రాజశేఖర్ రావు, వీఏఎస్ ప్రవీణ్‌రెడ్డి, వీఏ స్వప్న తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్ మండలంలో..

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం మచ్చర్లతోపాటు పలు గ్రామాల్లో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ఎంపీపీ పస్క నర్సయ్య సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన, వైద్య సిబ్బందితో కలిసి పశువులకు టీకాలు వేశారు. మండల పశుసంవర్ధక శాఖ అధికారి ప్రభాకర్, సిబ్బంది రాధ, నాగార్జున, శ్రీనివాస్ గౌడ్, నర్సయ్య, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

బాలికల భద్రతపై అవగాహన



నందిపేట్: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో సోమవారం షీటీం ఆధ్వర్యంలో బాలికల భద్రత, రక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. షీటీం అధికారులు మాట్లాడుతూ.. ఆకతాయిలు వేధింపులకు పాల్పడితే షీటీంను సంప్రదించాలని బాలికలకు సూచించారు. అలాగే సైబర్ క్రైమ్‌పై అవగాహన కల్పించారు. ఏఎస్సై రాజేందర్, షీటీం సిబ్బంది సుమతి, విగ్నేష్, బలరాం, రాజేశ్వర్, సుధీర్ ఉన్నారు.

చిన్నారులకు టీకాలు ఇప్పించాలి



ఆర్మూర్‌టౌన్: 16సంవత్సరాల లోపు బాలలకు టీకాలు ఖచ్చితంగా ఇప్పించాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ అశోక్ అన్నారు. పట్టణంలోని పట్టణ ఆరోగ్య కేంద్రంలో సోమవారం మిషన్ ఇంద్ర ధనుష్ కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నెలవారి టీకాలు తీసుకోలేని చిన్నారుల కోసం ఈనెల 12వరకు వాక్సినేషన్ డ్రైవ్ జిల్లా వ్యాప్తంగా కొనసాగుతుందన్నారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో రమేష్, ఆరోగ్యశాఖ అధికారులు కృష్ణమూర్తి, సాయి, వైద్యులు ఉన్నారు.

రోడ్డు పనులు ప్రారంభించే వరకు దీక్షలు చేస్తాం


రెంజల్‌లో రిలే దీక్షలు నిర్వహిస్తున్న రైతులు


మూసి ఉన్న దుకాణాలు

రెంజల్(బోధన్): రెంజల్ నుంచి దూపల్లితో పాటు ఎడపల్లి మండలం బ్రహ్మణపల్లి గ్రామాల వరకు రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించే వరకు రిలే నిరాహార దీక్షలను కొనసాగిస్తామని రైతు సంఘం ప్రతినిధులు పేర్కొన్నారు. రెంజల్‌లో స్థానిక రైతులు చేపట్టిన రిలే దీక్షలు సోమవారం 41వ రోజుకు చేరుకున్నాయి. పలువురు రైతులు నిజామాబాద్ కలెక్టరేట్‌కు తరలివెళ్లి ప్రజావాణిలో అధికారులకు వినతిపత్రం అందించారు. ప్రభుత్వం స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు. రైతులు రాజుగౌడ్, శ్రీనివాస్, వెంకటి, ఒడ్డెన్న, ఉన్నారు.

రెంజల్ బంద్ ప్రశాంతం..

రెంజల్‌లో రైతుల రిలే దీక్షలకు మద్దతుగా మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన బంద్ విజయవంతమైంది. వ్యాపారులు స్వచ్ఛందంగా దుకాణాలను సాయంత్రం వరకు మూసి ఉంచారు. రిలే దీక్షలకు సంఘీభావం ప్రకటించారు. వ్యాపారులు సాయిబాబాగౌడ్, సాయాగౌడ్, అబ్బన్న, సాయిలు, రాములు, నాగనాథ్, హుస్సెన్, ఆనంద్, చందన్, రాములు, శేఖర్ పాల్గొన్నారు.

బిడ్డకు తల్లి పాలు శ్రేయస్కరం


బాల్కొండలో చిన్నారులకు అన్నప్రాసన చేస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది, ప్రజాప్రతినిధులు

ఆర్మూర్‌టౌన్/బాల్కొండ/కమ్మర్‌పల్లి: బిడ్డకు తల్లి పాలే శ్రేయస్కరమని ఐసీడీఎస్ సీడీపీవో జ్యోతి పేర్కొన్నారు. ఆర్మూర్, బాల్కొండ నియోజకవర్గాల్లోని పలు మండలాల్లో సోమవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. బాల్కొండలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జ్యోతి మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. ఆర్మూర్‌లోని 2వ వార్డులో నిర్వహించిన కార్యక్రమంలో కౌన్సిలర్ ఖాందేష్ సంగీత పాల్గొని, మాట్లాడారు. అలాగే కమ్మర్‌పల్లి మండలంలోని కోనాసముందర్‌లోగల అంగన్‌వాడీ కేంద్రాల్లో అంగన్‌వాడీ సిబ్బంది మాట్లాడారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసాలు నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కేంద్రాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

‘వెదజల్లె’ వరి సాగు లాభదాయకం


వన్నెల్(బి)లో పంటలను పరిశీలిస్తున్న అధికారులు


వేల్పూర్‌లో వివరాలు నమోదు చేస్తున్న ఏఈవో

బాల్కొండ: వెదజల్లె పద్ధతిలో వరి సాగు చేయడం వలన అనేక లాభాలు ఉన్నాయని ఏవో మహేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని వన్నెల్(బి) గ్రామంలో సోమవారం రైతులు వెదజల్లె పద్ధతిలో సాగుచేస్తున్న వరి పంటను ఆయన పరిశీలించారు. ఈసందర్భగా ఏవో మాట్లాడుతూ.. .. ఈ పద్ధతితో వరిలో దిగుబడి పెరుగుతుందన్నారు. ఏఈవో నిహారిక, రైతులు ఉన్నారు.

పంటనష్టం వివరాలు నమోదు

వేల్పూర్: మండ కేంద్రంలో భారీ వర్షాలకు నష్టపోయిన పంటల వివరాలను సోమవారం ఏఈవో నిఖిల్, బీఆర్ఎస్ నాయకులు నమోదు చేశారు. పంటనష్టం వివరాలను ప్రభుత్వానికి అందజేస్తామని వారు తెలిపారు. జిల్లా ఆర్‌టీఏ సభ్యుడు రేగుల్లరాములు, ఉపసర్పంచ్ పిట్లసత్యం, ఎంపీటీసీ మొండి మహేశ్, బీఆర్ఎస్ నేతలు ఉన్నారు.

ప్రజా గాయకుడు గద్దర్‌కు ఘన నివాళి


ఆర్మూర్‌లో నివాళులు అర్పిస్తున్న దళిత సంఘాల నాయకులు..


బోధన్ పట్టణంలో..


నవీపేట మండల కేంద్రంలో..

ఆర్మూర్‌టౌన్/బోధన్/రెంజల్/నందిపేట్/నవీపేట: ప్రజా గాయకుడు గద్దర్‌కు కార్మిక సంఘాల సభ్యులు, వామపక్ష పార్టీల నేతలు, వివిధ ప్రజా సంఘాల నాయకులు ఘన నివాళులు అర్పించారు. ఈసందర్భంగా ఆర్మూర్, బోధన్, బాల్కొండ నియోజకవర్గాల్లోని పలు మండలాల్లో ఆయా వర్గాల నాయకులు సోమవారం గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి, రెండు నిమిషాలు మౌనం పాటించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ.. గద్దర్ విగ్రహాన్ని హైదరాబాద్‌లోని ట్యాంక్ బండ్‌పై నెలకొల్పాలన్నారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఉపాధి సిబ్బందికి పేస్కేల్ ఇవ్వాలి



డొంకేశ్వర్(ఆర్మూర్): తమకు కూడా పేస్కేల్ అమలు చేసి, రెగ్యులర్ చేయాలని ఉపాధిహామీ ఉద్యోగుల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు వారు సోమవారం ఎమ్మెల్సీ కవితను కలిసి వినతిపత్రం అందజేశారు. ఐకేపీ శాఖలో పని చేస్తున్న ఐకేపీ ఉద్యోగులను ఒక విధంగా, ఉపాధి హామీ ఉద్యోగులను మరోవిధంగా చూడడం సరి కాదన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి, తమకు న్యాయం చేయాలని కోరారు. నాయకులు సురేశ్, నర్సయ్య, సుశీల్, అరుణ్, రాంబాబు, లక్ష్మణ్, తదితరులున్నారు.

నాసిరకం పనులతో ధ్వంసమైన రోడ్డు



వేల్పూర్: మండలంలోని పచ్చలనడ్కుడ- మోతె తారురోడ్డు నాసిరకంగా నిర్మించడం వల్ల పూర్తిగా ధ్వంసమైందని బీజేపీ రాష్ట్ర నాయకుడు ఏలేటి మల్లికార్జున్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం ఆయన పార్టీ నేతలతో కలిసి రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కమీషన్లకు కక్కుర్తిపడి నాసిరకంగా నిర్మించడం వల్ల రోడ్లు పాడవుతున్నాయని ఆరోపించారు. ఇకనైనా రోడ్లను నాణ్యతగా నిర్మించాలని డిమాండ్ చేశారు. నాయకులు మోహన్, శ్రీనివాస్, రమేశ్‌రెడ్డి, బాలకిషన్, వల్లం రవి, పెద్దన్న, సతీష్, సంతోష్‌రెడ్డి ఉన్నారు.

బహుజన రాజ్యాధికారంతోనే న్యాయం



బోధన్: రాజ్యాధికారంతోనే బహుజనులకు న్యాయం జరుగుతుందని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి సింగాడే పాండు అన్నారు. పట్టణంలోని పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో సోమవారం పలువురు బీఎస్పీలో చేశారు. అనంతరం పట్టణంలో నేడు నిర్వహించనున్న బైక్ ర్యాలీకి అనుమతి కోసం ఏసీపీ కిరణ్ కుమార్‌ను పార్టీ నేతలు కలిసి విన్నవించారు. నాయకులు గంగాధర్, రాములు ఉన్నారు.

సమాచారం..

పోస్టాఫీస్‌లో జాతీయ జెండాలు



ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ డివిజన్ పరిధిలోని ప్రతీ బ్రాంచ్ పోస్టాఫీసులో జాతీయ జెండాలు అందుబాటులో ఉంటాయని ఎస్పీవోస్ అనిల్ కుమార్, సహాయ పర్యవేక్షకురాలు యాపరు సురేఖ అన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతీ గ్రామంలోని బ్రాంచ్ పోస్ట్ ఆఫీస్‌లో జాతీయ జెండాలను రూ.25కు విక్రయిస్తున్నట్లు పేర్కొన్నారు. జెండాలు కావలసినవారు ఆన్‌లైన్‌లో కూడా ఆర్డర్ చేయవచ్చన్నారు.

ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు ఆహ్వానం

డొంకేశ్వర్(ఆర్మూర్): డొంకేశ్వర్ ఓపెన్ స్కూల్‌లో టెన్త్, ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఓపెన్ స్కూల్ అసిస్టెంట్ కో–ఆర్డినేటర్ సుదర్శన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగలవారు టీసీతో పాటు సంబంధిత ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 9492480110ను సంప్రదించాలని సూచించారు.

ఆధ్యాత్మికం..

శివాలయంలో ప్రత్యేక పూజలు



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని నవనాథ సిద్ధులగుట్టపై గల శివాలయంలో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆర్మూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీత, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజేశ్వర్‌రెడ్డి లింగానికి పంచామృతాలతో అభిషేకం చేశారు. అనంతరం స్వామివారి ఉత్సవ విగ్రహాలకు పల్లకీసేవ నిర్వహించారు.

సినిమాలు | తెలుగు/హిందీ/ఇంగ్లీష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

- స్క్రీన్-1 – బ్రో(తెలుగు)2డీ-11.00, 1.55, 4.50,7.45, 10.40
- స్క్రీన్-2 – మెగ్(తెలుగు) – 10.45, 1.25, 7.20, 10.00; ఎల్‌జీఎమ్(తెలుగు)- 4.05
- స్క్రీన్-3 – రాఖీ ఔర్ రాణికి ప్రేమ్ కహానీ – 10.05, 7.00,10.35, మిస్టేక్, 4.35
- స్క్రీన్-4 – బేబి(తెలుగు) -11.10, 6.30, ఓపెన్ హైమర్(ఇంగ్లీష్) 2.40, ఎల్‌జీఎం 10.00

సంక్షిప్తం

కాంగ్రెస్ శ్రేణుల సంబురాలు

మాక్లూర్: కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ పార్లమెంట్ సభ్యత్వాన్ని పునరుద్ధరించటంతో సోమవారం మండలంలో కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ, టపాసులు కాలుస్తూ, సంబురాలు నిర్వహించారు. డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, నిజామాబాద్ గ్రంధాలయ సంస్థ మాజీ చైర్మన్ మార చంద్రమోహన్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా చేనేత దినోత్సవం

రుద్రూర్: మండల కేంద్రంలోని చేనేత సహకార సంఘం కార్యాలయంలో సోమవారం జాతీయ చేనేత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాలక వర్గం ఆధ్వర్యంలో చేనేత కార్మికులను సన్మానించారు.

ఎస్సై ఉద్యోగానికి ఎంపికైన శ్రీసాయికి అభినందన

కమ్మర్‌పల్లి: మండల కేంద్రానికి చెందిన శ్రీసాయి ఎస్సై ఉద్యోగానికి ఎంపిక కావడంతో సోమవారం ఆయనను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ ఏలేటి మల్లికార్జున్ రెడ్డి, పూర్వ విద్యార్థులు, ఎస్‌ఐ రాజశేఖర్ వేర్వేరుగా అభినందించారు. స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కల్లెడిలో ‘యూత్ జోడో’

మాక్లూర్: కల్లెడి గ్రామంలో సోమవారం ఆలూర్ మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు సిరికొండ మహేష్ ఆధ్వర్యంలో బూత్ జోడో యూత్ జోడో కార్యక్రమం జరిగింది. నాయకులు ప్రశాంత్, నవనీత్, వినోద్, అరవింద్, శివ ఉన్నారు.

క్రీడాకారుడికి చేయూత

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్‌కు చెందిన రెజ్లింగ్ క్రీడాకారుడు ఓర్సు మహేష్‌కు అంకాపూర్ రాకేష్ రెడ్డి ఫౌండేషన్ డైరెక్టర్ సుచరితరెడ్డి సోమవారం రూ.10 వేల నగదు అందజేశారు. ఎంపీటీసీ యాల్ల రాజ్ కుమార్, సుభాష్‌చంద్ర, శేఖర్, శోభన్, మహేష్ జయకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఆర్మూర్ అసెంబ్లీ కన్వీనర్‌గా వినోద్

మాక్లూర్: బీజేపీ ఓబీసీ మోర్చా ఆర్మూర్ అసెంబ్లీ కన్వీనర్‌గా మండలంలోని చిన్నాపూర్‌కు చెందిన గంగానే వినోద్ నియమితులయ్యారు. సోమవారం మోర్చా జిల్లా అధ్యక్షుడు యామాద్రి భాస్కర్ ఆయనకు నియామకపత్రం అందజేశారు. జిల్లా నాయకులు పాతంకర్ లక్ష్మినారాయణ, గంగోనే సంతోష్, సురేష్‌నాయక్‌లు పాల్గొన్నారు.

హృదయాన్ని తట్టి లేపేదే కవిత్వం

ఆర్మూర్‌టౌన్: మన లోపల ఉన్న హృదయాన్ని తట్టి లేపేదే కవిత్వమని సాహిత్య విభాగం జిల్లా కన్వీనర్, ప్రముఖ కవి, తిరుమల శ్రీనివాస్ ఆర్య అన్నారు. పట్టణంలోని బాలుర పాఠశాలలో సోమవారం భారత జాగృతి సాహిత్య విభాగం జిల్లా శాఖ ఆధ్వర్యంలో కవిత యజ్ఞం నిర్వహించారు. జిల్లా కోకన్వీనర్ కంకణాల రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌వోసీ అందజేత

బాల్కొండ: మెండోరా మండల కేంద్రానికి చెందిన ఓ బాధితుడి వైద్య చికిత్స కోసం సోమవారం బాధిత కుటుంబానికి మంత్రి ప్రశాంత్‌రెడ్డి రూ.2లక్షల ఎల్‌వోసీ అందజేశారు. స్థానిక నాయకులు తదిరతులు ఉన్నారు.

నిరుపేదలకు ఇళ్లు ఇవ్వండి

బోధన్‌టౌన్(బోధన్): పట్టణ శివారులో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను తక్షణమే నిరుపేదలకు పంపిణీ చేయాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో డబుల్ బెడ్‌రూం ఇళ్లను పరిశీలించారు. నాయకులు నవీన్, బడు, ఖలీం, సాయికృష్ణ, అలీ, సాయిలు, రిజ్వాన్, వహీద్ మున్నా ఉన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

99122 20764
90102 86628 (నిజామాబాద్)
94920 10949 (బోధన్, బాన్సువాడ)
95055 08389 (ఆర్మూర్)

Office mail : nzbadvt@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.

యం.మధుసూధన్ (ACO) : 9951027699
రాంనాథ్ (నిజామాబాద్ అర్బన్ & రూరల్) : 7997958181
ఎ.శివ (ఆర్మూర్) : 9848956776
పి.కళ్యాణ్ (బోధన్) : 83281 91021
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899